ఓం నమో భగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర

## (జిన్నూరులో శ్రీ నాన్నగారి ప్రవచనము, 27-2-97)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా !

నీ హృదయగుహలో పరమాత్మ స్వయంగా ప్రకాశిస్తున్నాడు. అక్కడ దేహం గొడవగాని, లోకంగొడవగాని, ఇతర విషయాలుగాని, ఏమీలేవు. ఉన్నది ఒక్కటేవస్తువు. ఆ వస్తువుకు నీ స్థూలదేహంతో గాని, సూక్ష్మదేహంతోగాని ఏమీ సంబంధంలేదు. బాహ్యమైన సహాయం ఏమీలేకుండా నీ సూక్ష్మదేహానికి, స్థూలదేహానికి అతీతంగా ఆ వస్తువు నీ హృదయగుహలో స్వయంగా ప్రకాశిస్తోంది. చనిపోవటం అంటే పాతదేహాన్ని వదలటం, పుట్టటం అంటే కొత్తదేహాన్ని తొడుక్కోవటం. దేహం మారటం వలన నీ మనస్సులో ఏమీ మార్పురాదు. ఎంతో కష్టపడి సాధనచేస్తేగాని, దైవానుగ్రహం ఉంటేగాని మారుమనస్సు రాదు. ఈ దేహం మరణించి కొత్తదేహం లోనికి వెళ్ళినపుడు మనం మనస్సులోనే లెగుస్తాము. ఆ మనస్సులో ఏ వికారములు ఉన్నాయో వాటినిబట్టి ఈదేహాలు నడుస్తాయి. మనస్సు నశించిన యోగికి లోకంతోటి, దేహంతోటి పనిఏముంది? ఈ విశాలప్రపంచంలో ఎవడికి ఏ కోరిక ఉంటే ఆకోరికను నెరవేర్చుకోవటానికి పనిచేస్తాడు. దానికి అనుగుణంగా ఈ శవాన్ని త్రిప్పుతూ ఉంటాడు. కోరిక నశించింది అనుకోండి వాడు జనన, మరణములు లేని స్థితికి ఎదుగుతాడు ఎందుకంటే వాడికి లోకంతో పనిలేదు దేహంతో పనిలేదు. నీ హృదయంలో ఉన్న సత్యవస్తువునే ఆచార్యులవారు బ్రహ్మం అన్నారు. రమణుడు దానినే పట్టకోవలసిన నేను, నిజమైన నేను అన్నారు. మీరు పూజ, జపం, ధ్యానం చెయ్యండి. వీటి యొక్క ప్రయోజనం ఏమిటి అంటే అసత్యమైన నేనును అంటే దేహగతమైన నేనును విడిచిపెట్టాలి. సత్యమైన నేనును పట్టుకోవాలి. సత్యమైననేను ఆత్మగతమైనది.

అజ్ఞానం ఎక్కడఉందో తెలిస్తే దానిని తొలగించుకోవటానికి ప్రయత్నం చేయవచ్చు. ఏ మనస్సు అయితే మనకు నేనుగా వ్యక్తమవుతోందో అందులో అజ్ఞానం ఉంది. అజ్ఞానం అంతా నేను, నాదిలో ఉంది. ఈ నేను అణిగిపోతే అజ్ఞానం అణిగిపోతుంది. నీ హృదయగుహలో బ్రహ్మం తనంతట తానుగా ప్రకాశిస్తోంది. ఆ బ్రహ్మంలో తెంపులేనిఎరుక, తెంపులేని ఆనందం, తెంపులేనిశాంతి, తెంపులేనిసుఖం నిరంతరం ప్రవహిస్తూ ఉంటుంది. లోకం కనిపించినా, కనబడకపోయినా, దేహం ఉన్నా లేకపోయినా. ఆనందం తెంపు లేకుండా సతతము ప్రవహిస్తూ ఉంటుంది. అక్కడ ద్వితీయం లేదు. లాభములలో ఆత్మలాభమునకు మించిన లాభం లేదు. మిగిలిన లాభములు అన్నీ నీమనస్సు ఎంత నిజమో ఆలాభములు అన్నీ కూడ అంతే నిజం. శ్రవణం చాలాకాలం నుండి చేస్తున్నారు. కాని మీ ఇంటిదగ్గర వచ్చే చిన్నగొడవలకు కూడా తట్టుకోలేక పోతున్నారు. దీనికి కారణం ఏమిటి అంటే శ్రవణం చేస్తున్నారు గాని ప్రాక్టీసులేదు. ప్రాక్టీసు లేకుండా అనుభవంలోనికి రాదు. వింటే సరిపోదు. మనం చేయగలిగినంత ఆచరణ చేస్తే అది అనుభవంలోనికి వస్తుంది. అందువలన ఆచరించటానికి ప్రయత్నం చేయాలి.

ఇప్పుడు మనంఅంతా లోకంలో ఉన్నాము అనుకొంటున్నాము. జ్ఞాని ఏమనుకొంటాడు అంటే నాలో లోకం ఉంది అనుకొంటాడు. కాళ్ళు, చేతులు, ముక్కు ఈ అవయవాలు వేరు అయినా అవి అన్నీ నాదేహంలో భాగములే. అవి అన్నీ నావే అనుకుంటాను. అందువలన వాటిని జాగ్రత్తగా చూసుకుంటాను.

అలాగే జ్ఞానికి కూడా లోకం అంతా తానుగా కనబడుతుంది. ద్వేషించటానికి అక్కడ రెండవది ఉండదు. ద్వైతం ఉన్నప్పుడు కోపం, ద్వేషం వస్తుంది. బ్రహ్మంలో ద్వైతంలేదు. హృదయంలో ఆత్మ ఉంది అంటున్నారు కదా దానిని తెలుసుకోవాలనే కోరిక ఎందుకురావటంలేదు అని ఆచార్యులవారిని అడిగారు. నీకు ఏమికోరికలు ఉన్నాయి అన్నారు ఆచార్యులవారు. అతను ఏవో కోరికలు చెప్పాడు. ఆ కోరికలను వదిలేస్తే ఆత్మచింతన కలుగుతుంది, ఆత్మను సంపాదించాలనే కోరిక కలుగుతుంది అన్నారు. మనస్సు రెండు పనులు చేయలేదు. 1) పెర్ఫెక్షన్ 2) ఎంజాయ్‌మెంట్. వెళితే నువ్వు పెర్ఫెక్షన్ వైపుకు అయినా ప్రయాణించాలి. లేకపోతే ఎంజాయ్‌మెంట్ వైపుకు అయినా ప్రయాణం చేయాలి. ఎంజాయ్‌మెంట్‌ను కనుక వదిలేస్తే ఆత్మజ్ఞానం సంపాదించాలనే కోరిక కలుగుతుంది. శాస్త్రవాసన, లోకవాసన, దేహవాసన లేనపుడు ఆత్మవాసన కలుగుతుంది.

నీ హృదయగుహలో బ్రహ్మం ఎంత నార్మల్‌గా ఉందో, ఎంత నేచురల్‌గా ఉందో అలాగ హృదయగుహలో ఉండగలిగితే ఇంక నీవు ఈ దేహమనే గుల్లలోనికి రానక్కరలేదు. అంటే నీకు పునర్జన్మరాదు. ఉన్నది ఒక్కటే వస్తువు. అది అందరిలోనూ సమానంగా ప్రకాశిస్తోంది అది సత్యవస్తువు. అది జడవస్తువుకాదు. తాను ఉన్నానన్న సంగతి దానికి తెలుస్తూ ఉంటుంది. దేవుడు ఉన్నాడు అని నీవు అనుకొంటున్నావు. కాని నీ అనుభవంలో జీవుడు ఉన్నాడు గాని దేవుడు లేడు. ఇప్పుడు ఏ విధంగా జీవుడు నీకు అనుభవంలో ఉన్నాడో అలాగ దేవుడిని అనుభవంలోనికి తెచ్చుకోవటమే నీ భక్తియోగం, జ్ఞానయోగం, కర్మయోగముల లక్ష్యం. జీవలక్షణాలు, మనస్సులో వచ్చే వికారములు ఏవిధంగా అయితే నీకు డైరెక్టుగా అనుభవంలో ఉన్నాయో అంతడైరెక్టుగా నువ్వు ఈశ్వరుడిని అనుభవంలోనికి తెచ్చుకొన్నప్పుడు కదా నీవు జ్ఞానివి అవుతావు. ఈశ్వరుడిని డైరెక్టుగా అనుభవంలోనికి తీసుకొని రావటానికి నీకు సహాయ సహకారములు అందించే వాడే గురువు. నీ మనస్సును నిగ్రహించుకోవటానికి పూజ, జపం, ధ్యానం చేయమన్నారు. ప్రతీ దానికి పుణ్యం వస్తుంది అని అనుకోనక్కరలేదు. వస్తే వస్తుంది దాని గొడవ వద్దు. ధ్యానం వలన నీ మనస్సు అణుగుతుంది. ఒకే వస్తువును చింతించటంవలన నీ మనస్సులోనికి అనవసరమైన గొడవలు రావు. ఒకే వస్తువును చింతించటంకూడా తలంపే. ఆ తలంపు వెళ్ళి చివరకు ఆత్మలో ఐక్యమవుతుంది, ఆత్మాకారం చెందుతుంది.

ఓం నమో భగవతే వాసుదేవాయ, ఓం నమో భగవతే శ్రీరమణాయ అని మంత్రాలు చెపుతున్నారు కదా. అంటే వాసుదేవా నీకు నమస్కారం అనిచెప్పటం. భగవంతుడికి ఈ నమస్కారం ఎవరు చెపుతున్నారు. మన మనస్సు చెపుతోంది. నమస్కారం పెట్టే మనస్సు అణగాలి. ఏ నారాయణుడిని ప్రార్థిస్తున్నావో ఆయన నీకు వ్యక్తమవ్వాలి. మనస్సు ఇప్పుడు నీకు నేనుగా ఎలా వ్యక్తమవుతోందో నమస్కారం పెట్టించుకొనే ఆ నారాయణుడు అలా వ్యక్తమయ్యే వరకూ జపం చేయమన్నారు. నీ హృదయంలో బ్రహ్మం ఎలా ఉందో నువ్వుకూడా అలాగ ఉండిపో. అలా ఉండటం నీకు ఇష్టంలేకపోతే ఏదో తల్లికడుపులోనికి వచ్చేస్తావు. నీ హృదయంలో బ్రహ్మం ఎలా ఉందో అలాగ నీవు హృదయగుహలో ఉండగలిగితే తెంపులేని ఆనందం, తెంపులేనిశాంతివస్తాయి. చావులేనిస్థితికి, ఆనందమయస్థితికి ఎదిగి వెళ్ళిపోతావు. మనకు కొద్దిసేపు ఆత్మచింతన తరువాత దేహచింతన, లోకచింతన వచ్చేస్తాయి. అలాకాదు ఇతర తలంపులు లేకుండా నీ హృదయంలో బ్రహ్మం ఎలా ఉందో అలా ఉండగలిగితే నీవు బ్రహ్మం అయిపోతావు. తిరిగి తల్లిగర్భంలోనికి ప్రవేశించనక్కరలేదు. ఇవి అన్నీ ఊహించి చెప్పినవికాదు. వారి అనుభవాన్ని తీసి చెపుతున్నారు. నీకు దేహం అవసరం లేకపోతే, పునర్జన్మలేనిస్థితి నీకు కావాలంటే, అమృతస్థితి కావాలంటే ఇప్పుడు దేహం

నేను అని ఈ దేహముతో ఎలా తాదాప్యం పొందుతున్నావో అలాగ నీ హృదయగుహలో ఉన్న సత్యవస్తువుతో నీకు తాదాప్యం వచ్చినపుడు కదా నీవు పునర్జన్మలేని స్థితికి ఎదిగి వెళ్ళి పోవటం అంటున్నారు ఆచార్యులవారు.

సమాజంలో పనిచేసే వారు అందరూ జ్ఞానం కోసం పనిచేస్తే ఫరవాలేదు. కాని దేహగతమైన నేనును పెంచుకోవటానికి పనిచేస్తారు. సమాజమునకు సేవచేస్తున్నాము అంటారు సమాజమునకు సేవచేయుటం నీ అజ్ఞానమును పోగొట్టుకోవటానికా? లేక నీ దేహబుద్ధిని పెంచుకోవటానికా? నీ దేహబుద్ధిని పెంచుకొంటే మరణానంతరము చీకటిలోకాలేగతి. దేహాన్ని అలంకరించు కోవటంకంటే దేహబుద్ధిని అలంకరించుకోవటం ఇంకా ప్రమాదం. దేహబుద్ధిని అలంకరించుకోవటం వలన అజ్ఞానంలో పడిపోతావు. ఈశ్వరుడు ఉన్నాడు అనుకొంటే సరిపోదు. నీమనస్సు నీకు ఏ విధంగా అయితే అనుభవంలో ఉందో అలాగ ఈశ్వరుడిని అనుభవంలోనికి తెచ్చుకోవాలి అప్పుడు నువ్వు చావులేనిస్థితికి, అమృతస్థితికి వెళ్ళిపోతావు.

దేహవాసన, శాస్త్రవాసన ఇవి పోవాలంటే అంత తేలికగా పోవు. బహుజన్మల నుండి ఇవి నీకూడా వస్తున్నాయి. చెడ్డవాసన వచ్చే పదార్థం నీ చేతికి అంటుకొంటే అది పోవాలి అంటే పోతుందా? దానిని సబ్బుపెట్టి తోమగా, తోమగా కొంతకాలానికి ఆ చెడువాసన పోతుంది. అంతేగాని కుర్చీలో ఫాన్ క్రింద కూర్చొని ఆ వాసన పోవాలి అంటే పోతుందా? పోదు. బాహ్యంగా నీచేతికి అంటుకొన్న చెడువాసన పోవటానికే అంత కష్టం అయితే బహుజన్మల నుండి నీకూడా వస్తున్న వాసనలు పోవటం చాలాకష్టం. దేహాన్ని స్మరిస్తూ ఉంటే దేహవాసన పోదు. చెట్టుక్రింద కూర్చొని లోకం గొడవలు చెప్పుకొంటూ ఉంటే లోకవాసన పోదు. అనుభవంలేని పండితుల దగ్గరకూర్చొని మేము గీత నేర్చుకొన్నాము ఉపనిషత్‌లు మాకు నోటికి వచ్చేసాయి అంటే శాస్త్రవాసనపోదు. శాస్త్రాలు చదివినంత మాత్రంచేత శాస్త్రవాసనపోదు. ఏదైతే పోగొట్టుకోవాలోఅస్తమానూ అక్కడే పడిఉంటే అది ఎలా పోతుంది. నీ ఇష్టదేవతను స్మరించటం వలన గాని, గురువును ధ్యానించటం వలనగాని, డైరెక్టుగానీ హృదయగుహలో మనస్సును నిలబెట్టి ఉంచటం వలనగాని దేహవాసన, లోకవాసన, శాస్త్రవాసన నశిస్తాయి గాని నిరంతరము దేహంచుట్టూ తిరుగుతూ ఉంటే దేహవాసనపోదు. నీకు కోటి వాసనలు ఉన్నా అవి అన్నీకూడా ఈ మూడు వాసనలలో ఏదో ఒకదానిలో ఇమిడిఉంటాయి. ఇవి బహుజన్మల నుండి నీకూడా వస్తున్నాయి. వీటిని తొలగించుకోవటానికి ప్రయత్నంచేయాలి. ఆ వాసనలు ఉన్నాయి అని వాటిని పట్టించుకోకుండా నీవు అలక్ష్యంగా ఉంటే, వాటినుండి బయటపడటానికి నీవు ఏమీ ప్రయత్నం చేయకపోతే సుడిగాలిలో పడిన గడ్డిపరకను సుడిగాలి ఎలా త్రిప్పేస్తుందో అలాగ ఈవాసనలు నిన్ను బహుజన్మలలో త్రిప్పేస్తాయి. ఈవాసనలను నిర్లక్ష్యంచేస్తే నీవు అనేకసార్లు స్మశానానికి వెళ్ళవలసిఉంటుంది. శ్రద్ధ లేనివాడికి జ్ఞానం రాదు అని చెప్పారు. అజాగ్రత్త పనికిరాదు. జాగ్రత్తఅవసరం, శ్రద్ధఅవసరం. ఈ వాసనలను జయించటం కష్టమే గాని నాయందు ప్రేమకలిగిఉంటే, నాయందు భక్తికలిగిఉంటే, నామీద భారం వేసి జీవిస్తే నీమీద నాకు అనుగ్రహం కలిగి నీలో ఉన్న పునర్జన్మ హేతువులను నశింపజేస్తాను అని భగవంతుడు చెపుతున్నాడు.

ఇప్పుడు నీవు దేనితో అయితే తాదాప్యం పొందుతున్నావో అది అంత తేలికగా పోదు. ఏ వస్తువును అయితే పొందుదామనుకుంటున్నావో ఆ వస్తువు నాహృదయంలోనే ఉంది అంతేకాదు అది నేనై ఉన్నాను అనే నిశ్చలమైన బుద్ధికలిగితే, దానితో తాధాప్యం బలంగా వస్తే అప్పుడు నీవుకాని విషయాలతో సంబంధం తెగుతుంది గాని లేకపోతే అంతతేలికగా తెగదు. నిరంతరము ఆత్మను చింతించటం వలన, ఆత్మగురించిశ్రవణం చేయటంవలన, బాహ్యవిషయాలమీద మీ మనస్సు వాలకుండా పరమాత్మనే చింతిస్తూ ఉండటంవలన,

పరమాత్మగురించి తపించటం వలన నువ్వుకాని వస్తువుతో తాదాప్యం తెగిపోతుందిగాని లేకపోతే కోటిజన్మలు ఎత్తినా ఆ సంబంధం తెగదు. నీలోపల ఉన్న సత్యవస్తువుతో తాదాప్యం పెంచుకోవటంవలన నువ్వుకాని వస్తువుతో సంబంధం తెగిపోతుంది. కొంతమంది మేము గౌరవంగా బ్రతుకుతున్నాము గొప్పపేరు తెచ్చుకొంటున్నాము అని ఇలా సరిపెట్టుకొని ఇదే జీవితం అనుకొంటారు. వారు గౌరవం కోసం పనిచేస్తారు. గోత్రాలతో, కులాలతో, నామాలతో, గౌరవాలతో తాదాప్యం చెందుతారు. అదే మహామాయ. ఈదేహం ఎంతనిజమో అవి అన్నీ కూడా అంతే నిజం.

నీకు ధనం ఉండవచ్చు. అవసరానికి వాడుకో. కాని ధనం నీవుకాదు. అలాగే నీకు ఒక దేహం ఉండవచ్చు. ఆదేహంనీవుకాదు. దానిని మర్చిపో. ఈ విషయాలను సరిగా అర్థంచేసుకొని ఏదైతే అవునో దానిని తెలుసుకోవటానికి ప్రయత్నంచెయ్యి. నీవు కాని దానిని అవును అవును అనుకొన్నా నీవు అవ్వవు. నీవు భగవంతుని స్మరిస్తూ ఉంటే, ఆత్మను నిరంతరం స్మరిస్తూ ఉంటే ఆత్మకాని విషయములనుండి వేరుపడతావు. మోక్షానుభవం కలుగుతుంది. వాసన నశించకుండా నీకు మోక్షం కలుగదు. మోక్షమునకు సంబంధించిన జ్ఞానం కొంత ఉన్నా నీలో చిన్నవాసన ఉంటే గాలివానవచ్చినపుడు చెట్టును ఎలా ఊపేస్తుందో అలాగ ఆవాసన ఏదోరోజు నిన్ను ఊపిఅవతల పాడేస్తుంది. ఎన్ని ఉన్నా వాసనాక్షయం అయితే గాని, ఏదైతే నీ దుఃఖానికి కారణమో అది వేరుతో సహా నశిస్తేనే గాని నీకు మోక్షస్థితి కలుగదు. వాసన అణుమాత్రం ఉన్నా అది విజృంభించే అవకాశం ఉంది. అది వేరుతోసహాపూర్తిగా నశిస్తే గాని నమ్మటానికి వీలులేదు.

మేము పెద్దవాళ్ళము అయిపోయాము అని అనుకోవద్దు. మనందరము జైలులో ఉన్నాము. ఎవడి సంసారం వాడికి జైలు అంటున్నారు ఆచార్యులవారు. పురాణాలువిని, భగవద్గీతవిని ఇందులోనుండి బయటకు వచ్చేద్దామని కొంతమంది అనుకొంటున్నారు. అలా వచ్చేయాలి అనిమీరు అనుకొన్నా వాసనలనే సంకెళ్ళు మీకాళ్ళకు, చేతులకు కట్టేసి ఉన్నాయి భగవంతుడు నిన్నుబంధించలేదు. వాసనలు, కోరికలు అనే సంకెళ్ళతో మనలను మనమే బంధించుకొంటున్నాము. వాసనాక్షయంఅయితే గాని ఇందులో నుండి బయటకురాలేవు. మీకు కట్టి వేయబడిన సంకెళ్ళు మీకు ఇష్టం అయినపుడు వాటిని ఎలా తెంచుకొంటారు. ఆ సంకెళ్ళ వలన వచ్చే నష్టాలు, ఆ సంకెళ్ళ వలన వచ్చే రాబోయేజన్మలు, ఆ సంకెళ్ళవలన వచ్చే చీకటిలోకాలు, మీకు అర్థమయ్యి ఆ సంకెళ్ళను తెంచుకోవాలి అనే కాంక్షతో వాటిని తొలగించుకోగలిగితే ఇప్పుడే, ఇక్కడే స్వర్గరాజ్యం అనుభవిస్తారు అని నేను మీకు వాగ్దానం చేస్తున్నాను అంటున్నారు ఆచార్యులవారు. వైరాగ్యం లేనివాడు ఈ సంకెళ్ళ నుండి బయటకురాలేడు. ఈ వాసనలు ఎంతలోతులలో ఉన్నాయో అంతలోతులలోనికి దిగి వాటిని షేక్ చేసి బయటకు లాగితేనేగాని అవి బయటకురావు. గురువు యొక్క చూపువలన, ప్రేమపూరితమైన మాటవలన వాసనయొక్క వేరు షేక్ అవుతుంది. తరువాత మనం దానిని లాగేసుకోవటం తేలిక. కొంతమంది ప్రేమిస్తే అతిగా ప్రేమిస్తారు. ద్వేషిస్తే అతిగా ద్వేషిస్తారు. సమానబుద్ధి ఉండదు. నీ హృదయంలో ఉన్న బ్రహ్మం సమానంగా ఉంది. అలాగ నీకు సమానబుద్ధి కలిగితే నీ హృదయంలో ఉన్న బ్రహ్మం సమానంగాఉంది కాబట్టి ఈ సమానబుద్ధి వెళ్ళి అందులో ఐక్యం అయిపోతుంది. అదే యోగం.

★